- సర్వే గ్రామాల పరిధిలో పోలీసుల చెక్‌పోస్టు ..

సర్వే నిర్వహిస్తున్న గ్రామాలకు ఇతరులు వెళ్లకుండా కందుకూరు మండలంలోని తుర్కగూడ వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు

- అడుగడుగునా పోలీస్ పహారా..

ఫోర్త్‌సిటీ భూముల సర్వే నిర్వహిస్తున్న గ్రామాల్లో ఎటుచూసినా పోలీసులే..

- సర్వేను అడ్డుకుంటే అదుపులోకి..

కొంగరకలాన్ వద్ద సర్వేను అడ్డుకున్న రైతులను బలవంతంగా పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న పోలీస్ సిబ్బంది

పోలీస్ ఫోర్స్‌తో ఫోర్త్‌సిటీ సర్వే

మొదటిపేజీ తరువాయి...

వచ్చిన అధికారులకు అదే పరిస్థితి ఎదురైంది. ఒక రైతు ఏకంగా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. తమకు తెలియకుండానే తమ భూముల్లో అధికారులు సర్వే చేస్తుండటంతో రైతులు భగ్గుమన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ కలెక్టరేట్ వెనుక ప్రాంతంలో మంగళవారం సర్వే చేసేందుకు వచ్చిన అధికారులతో రైతులు వాగ్వివాదానికి దిగి పనులను నిలిపివేశారు. దీంతో అధికారుల సమాచారంతో అక్కడికి వచ్చిన పోలీసులు రైతులను ఆదిబట్ల ఠాణాకు తరలించారు. అయినప్పటికీ సర్వే పనులను మాత్రం సాగనివ్వలేదు. రైతులను బలవంతంగా ఠాణాకు తీసుకెళ్లిన పోలీసులు.. అడ్డువచ్చిన మహిళలను గెంటేశారు. ఈ విషయం తెలుసుకున్న కొంగరకలాన్‌కు చెందిన అనేకమంది రైతులు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో వారిని కూడా పోలీసులు అక్కడి నుంచి లాక్కెల్లారు. శ్రీనివాస్ అనే రైతు వెంటనే సర్వే పనులను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ.. ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. పోలీసులు వెంటనే పెట్రోల్ డబ్బాను స్వాధీనం చేసుకుని అతడిని కూడా ఠాణాకు తరలించారు. ఔటర్‌రింగ్‌రోడ్డు నుంచి కొంగరకలాన్, పంజాగూడ, తిమ్మాపూర్, తుర్కగూడ మీదుగా ఫోర్త్‌సిటీ వరకు రోడ్డు వేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. రోడ్డు కోసం కొంగరకలాన్‌లో 90 ఎకరాలు, పంజాగూడలో 15 ఎకరాల పట్టా భూములను సేకరించనున్నది.

ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు..

కొంగరకలాన్ ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి ఫోర్త్ సిటీ వరకు 300 ఫీట్ల రోడ్డు వేసే గ్రామాల్లో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. బయటవారు గ్రామాల్లోకి రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. రోడ్డు సర్వేకు వచ్చిన అధికారులను కొంగరకలాన్, కందుకూరు మండలంలో రైతులు అడ్డుకోవడంతో అప్రమత్తమైన పోలీసులు భారీగా బలగాలను రప్పించారు. కొంగరకలాన్, పంజాగూడ, కందుకూరు, తుర్కగూడ తదితర గ్రామాల్లో పోలీసులను మోహరించి వారి నిఘాలో సర్వే పనులను చేపడుతున్నారు.

పొలాల్లో సర్వే నిర్వహిస్తున్న అధికారులను అడ్డుకుంటున్న రైతులు

ప్రాణాలైనా ఇస్తాం.. భూములివ్వం: రైతులు

ప్రాణాలైనా ఇస్తాం.. కానీ, భూములిచ్చే ప్రసక్తే లేదని కొంగరకలాన్‌కు చెందిన పలువురు రైతులు స్పష్టం చేశారు. తమకు తెలియకుండానే భూముల్లో సర్వే చేయడమేమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాతల కాలం నుంచి భూమిని నమ్ముకునే జీవిస్తున్నామని.. అది లేకుంటే తమకు జీవితమే లేదని స్పష్టం చేస్తున్నారు. పొలాలను తీసుకుని తమను రోడ్డుపాలు చేయొద్దని అధికారులు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. భూములను తీసుకుంటే వేరే ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా ఇవ్వాలని, లేని పక్షంలో తాము ఇక్కడే చనిపోతామని అధికారుల ఎదుట బైఠాయించారు.

- **భూములు లాక్కోవద్దు**

మాకున్న రెండెకరాల భూమి ఫోర్త్ సిటీ రోడ్డు కోసం పోతుంది. ఆ భూమిని నమ్ముకొనే జీవిస్తున్నాం. ఆ పొలం పోతే మా బతుకు శూన్యమే. ప్రభుత్వం మా భూములను బలవంతంగా తీసుకోవాలని చూడడం తగదు.

-రామాత్ చౌళి రైతు

- **పోలీసులు రానివ్వడంలేదు**

నాకు 2 ఎకరాల 8 గుంటల భూమి ఉన్నది. భూమి మధ్యలో నుంచి ఫోర్ట్ సిటీ రోడ్డు పోతున్నది. పొలానికి వెళ్తే పోలీసులు అడ్డుకుంటున్నారు. నేను, నా పిల్లలు ఎట్లా బతకాలి. మా భూమిలో గుర్తులు పెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డిని గెలిపిస్తే ఇంత మోసమా..? మా భూమిని తీసుకునే ముందు ప్రభుత్వం ఆలోచించాలి. రైతుల గోడు వినాలి.

-బండ రమేశ్, రైతు

- **రేవంత్ అయ్య జాగీరా?**

మా భూములను సీఎం ఇష్టానుసారంగా లాక్కోవడం ఏమిటి? ఆయన ఆయ్యా జాగీరా..? మాకు తెలియకుండా భూముల్లో సర్వే చేయడానికి ప్రభుత్వానికి ఏమి హక్కు ఉన్నది. ఫోర్త్‌సిటీ వద్దే..వద్దు.. భూములే మాకు కావాలి. సర్వేకు అధికారులు వస్తే అడ్డుకుంటూనే ఉంటాం.

-మహేందర్, కొంగరకలాన్

- **ఎందుకివ్వాలి..**

కాయకష్టం చేసుకుని జీవిస్తున్నాం. రోడ్డు కోసం నా పొలాన్ని ఎందుకు గుంజుకుంటరు. మేము ఎట్లా బతకాలి. ఇతరుల ప్రయోజనాల కోసం నా భూమిని ఇయ్య. మా భూమిని గుంజుకోవద్దు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి.

-రామాత్ సొడమ్మ, రైతు

- **రోడ్డు వేయనీయం**

మా భూముల నుంచి ఫోర్త్‌సిటీ రోడ్డును ఎట్టి పరిస్థితులోనూ వేయనీయం. భూములకు ప్రత్యామ్నాయంగా భూములిస్తేనే రోడ్డును వేయనిస్తాం. బలవంతంగా రోడ్డువేస్తే ప్రాణాలైనా ఇస్తాం.. కానీ, పనులను అడ్డుకుంటాం. ఫోర్త్‌సిటీ ఏర్పాటు చేయాలని మేము కోరామా..? మాకు ఫోర్త్‌సిటీ వద్దు.. ఏమి వద్దు.

-వెంకటేశ్, కొంగరకలాన్

- **ఆత్మహత్యే శరణ్యం..**

అప్పులు చేసి 10 నెలల కిందట పౌల్ట్రీ ఫామ్ పెట్టుకున్నా. మరో ఎకరన్నరలో పూల తోట వేశా. ఈ మొత్తం భూమి కూడా ప్రభుత్వం ఫోర్త్‌సిటీ కోసం ప్రతిపాదించిన స్థలంలోనే ఉన్నది. ఉన్న భూమి పోతే అప్పులకు వడ్డీలు కట్టడం గగనమే అవుతుంది. చావే శరణ్యమవుతుంది. రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ప్రభుత్వం మా పొలాల నుంచి రోడ్డును వేయడం తగదు. ప్రభుత్వం పునరాలోచించాలి.

- బాషమోని పద్మమ్మ, రైతు

- **భూములు పోయాక.. ఉంటే ఏంది.. పోతే ఏంది..?**

చస్తే కూడా బొందపెట్టేందుకు స్థలం లేకుండా చేస్తున్నారు. ఇది ప్రభుత్వానికి న్యాయమా..? అధికారులు మా గోడు వినాలి. పొలాలు పోయిన తర్వాత మా ప్రాణాలు ఉంటే ఎంది.. పోతే ఎంది.. సమాచారం ఇవ్వకుండా భూముల్లో అధికారులు సర్వే చేస్తున్నారు. ఫోర్త్‌సిటీకి 330 ఫీట్ల రోడ్డు అవసరమా? భూమి పోతే ఎట్లా బతకాలి. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో నుంచి రోడ్డు వేయాలి. పట్టా భూములను ఎందుకు తీసుకుంటున్నారు.

-అంజమ్మ, రైతు

పాము కాటుకు గురై నకిరేకల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న మూసీ గురుకుల పాఠశాల విద్యార్థి గణేశ్

మూసీ గురుకులంలో విద్యార్థికి పాముకాటు

నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలింపు

కేతేపల్లి, నవంబర్ 19: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని బొప్పారం గ్రామ శివారులో గల మూసీ గురుకుల పాఠశాలలో మంగళవారం సాయంత్రం విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన బద్దం చంద్రశేఖర్, అనిత దంపతుల కుమారుడు గణేశ్ మూసీ వద్ద గల మహాత్మాజ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం వాష్‌రూమ్ నుంచి తిరిగి వస్తుండగా గణేశ్ పాముకాటుకు గురయ్యాడు. విషయాన్ని ప్రిన్సిపాల్ ధనమ్మకు తెలియజేయడంతో విద్యార్థికి అక్కడే ప్రథమ చికిత్స చేయించి, నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గణేశ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. కాగా విద్యార్థి పాముకాటుకు గురైన సమయంలో పాఠశాలలో వైద్యసిబ్బంది ఎవరూ అందుబాటులో లేనట్టు తెలిసింది. పాఠశాల నిర్వహణ సరిగా లేదని, ప్రహరీ కూడా లేదని తరచూ పాములు వస్తున్నాయని గతంలోనే విద్యార్థులు తెలుపడంతో వారి తల్లిదండ్రులు పలుమార్లు యాజమాన్యానికి వినతులు అందజేశారు. పాఠశాల నిర్వాహకులు, సిబ్బంది పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.

15 అసెంబ్లీ స్థానాలకు బైపోల్స్ నేడు

లక్నో/చండీగఢ్: యూపీ, పంజాబ్, కేరళ, ఉత్తరాఖండ్ రాష్ట్రాలోని 15 శాసనసభ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. యూపీలో 9, పంజాబ్‌లో 4, కేరళ, ఉత్తరాఖండ్‌లలో ఒక్కో స్థానంలో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. వీటి ఓట్లను ఈ నెల 23న లెక్కిస్తారు.

ఐరాస ట్రక్కుల్లోంచి ఆహార పదార్థాల లూటీ

గాజాలో దుర్భర పరిస్థితులు: ఐరాస

జెరూసలేం, నవంబర్ 19: ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం కారణంగా గాజాలో పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. యుద్ధ బాధితులు, శరణార్థుల కోసం ఐక్యరాజ్యసమితి (ఐరాస) పంపిన ఆహార పదార్థాలను సరిగ్గా అందజేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం దక్షిణ గాజాలో విధ్వంసకర ఘటన చోటుచేసుకుంది. యునైటెడ్ నేషన్స్ రిలీఫ్, వర్క్స్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనా రెఫ్యూజీస్, నియర్ ఈస్ట్ (యుఎన్ఆర్‌డబ్ల్యూఏ) కోసం ఆహార పదార్థాలను తీసుకెళ్తున్న 109 ట్రక్కుల్లో..100 ట్రక్కులు దోపిడీకి గురయ్యాయి. అత్యంత భయానకంగా వాటిని కొంత మంది లూటీ చేశారని ఐరాస వర్గాలు మంగళవారం మీడియాకు తెలిపాయి. డ్రైవర్ల తలపై తుపాకీలు గురిపెట్టి...ఆహార పదార్థాలను బలవంతంగా అన్‌లోడింగ్ చేశారని, అనేక మంది సహాయక కార్యకర్తలు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని ఐరాస ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దోపిడీకి పాల్పడ్డవారిని గుర్తించలేదని, ఇజ్రాయెల్ అధికారులు అమలుజేస్తున్న విధానాల వల్లే గాజాలో అత్యంత ప్రమాదకర వాతావరణం ఏర్పడ్డాయని యుఎన్ఆర్‌డబ్ల్యూఏ అధికార ప్రతినిధి ఆరోపించారు.



46.6 కోట్ల ఏండ్ల క్రితం భూమి చుట్టూ వలయాలు!

న్యూఢిల్లీ: సౌర కుటుంబంలో బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాల చుట్టూ వలయాలు ఉన్నట్టుగానే 46.6 కోట్ల సంవత్సరాల క్రితం భూమి చుట్టూ కూడా ఇలాంటి వలయాలు ఉండి ఉండొచ్చని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. ఆర్డోవిసియన్ కాలంలో ఈ వలయాలు ఉనికిలో ఉండొచ్చని 'ఎర్త్ అండ్ ప్లానెటరీ సైన్స్ లెటర్స్' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది. ఆ వలయాలే ఆ తర్వాత ఉల్కాపాతంగా మారి మాయమై ఉండొచ్చని అంచనా వేసింది. భూమిపై జరిగిన ఉల్కల దాడి తర్వాత టెక్టోనిక్ ప్లేట్లలో జరిగిన గణనీయమైన మార్పును అధ్యయనకారులు గుర్తించారు. ఉల్కలు ఢీకొట్టడం ద్వారా ప్రభావితమైన దాదాపు రెండు డజన్ల బిలాలను అధ్యయనం చేసిన అనంతరం అధ్యయనకారులు ఈ అంచనాకొచ్చారు. ఇవన్నీ భూమధ్య రేఖకు 360 డిగ్రీల లోపలే ఉండడం గమనార్హం. భూమి చుట్టూ ఉన్న వలయం నుంచి ఈ ఉల్కాపాతం జరిగి ఉంటుందని వివరించారు. భూమధ్య రేఖకు సమీపంలో 21 బిలాలు ఉండడం గణాంకపరంగా చూస్తే అసాధారణ విషయమేనని మెల్‌బోర్న్‌లోని మోనాష్ యూనివర్సిటీకి చెందిన భూగోళ, గ్రహశాస్త్రాల ప్రొఫెసర్ ఆండ్రూ టామ్‌కిన్స్ పేర్కొన్నారు. నిజానికి ఇలా జరిగి ఉండకూడదని, బిలాలు యాదృచ్ఛికంగా ఏర్పడితే చంద్రుడిపై బిలాల్లా ఉండేవని వివరించారు. ఆర్డోవిసియన్ కాలంలో సౌరవ్యవస్థలో ఓ పెద్ద గ్రహశకలం కారణంగా భూమిపై ఉల్కాపాతం జరిగి ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొంటూ వస్తున్నారు. అయితే, తాజా అధ్యయనం మాత్రం అది నిజం కాదని కొట్టిపడేస్తున్నది. భూమి చుట్టూ ఉండే వలయం నుంచే ఉల్కాపాతం జరిగి ఉంటుందని పేర్కొంది. ఆర్డోవిసియన్ ముగింపు కాలం గత 50 కోట్ల సంవత్సరాలలో అత్యంత శీతల కాలంగా పరిగణిస్తారు. భూమి చుట్టూ ఉండే వలయాలు సూర్యకాంతిని భూమిపై పడకుండా అడ్డుకోవడం వల్ల భూమిపై ఉష్ణోగ్రతలు పడిపోయి ఉంటాయని టామ్‌కిన్స్ వివరించారు.

చెత్తకు జరిమానా.. ఆగిన గుండె

- ఒక్కసారిగా కూలబడి గుండెపోటుతో వృద్ధురాలి మృతి

మక్తల్, నవంబర్ 19: కుళ్లిన కూరగాయలు రోడ్డుపై వేస్తున్నావు.. రూ.200 ఫైన్ కట్టాలని మున్సిపల్ అధికారులు నోటీసు అందించగా.. గుండెపోటుతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు.. మక్తల్ మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రధాన రహదారి పక్కన బాలమ్మ అనే మహిళ కొన్నేండ్లుగా కూరగాయలు అమ్ముతూ జీవిస్తున్నది. అయితే కుళ్లిన, మిగిలిన కూరగాయలను రోడ్డుపై పడేస్తుండడంతో మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్, కార్యాలయ సహాయకుడు విధించిన రూ.200 ఫైన్ నోటీసును మంగళవారం ఉదయం సదరు వ్యాపారికి సిబ్బంది అందించారు. మళ్లీ చెత్త వేస్తే రూ.10 వేలు జరిమానా వేస్తామని హెచ్చరించారు. అధికారుల మాటలు విన్న వృద్ధురాలు ఒక్కసారిగా కూరగాయలు అమ్మే చోటే పడిపోయింది. స్థానికులు మక్తల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు.

అప్పుల బాధతో మరో రైతు ఆత్మహత్య

బల్మూరు, నవంబర్ 19: అప్పుల బాధలు భరించలేక మరో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం అనంతవరం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బాలస్వామి, వెంకటమ్మ దంపతులు. వీరి కూతురు శివమ్మను అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు ఇచ్చి 20 ఏండ్ల కిందట పెండ్లి చేశారు. నాటి నుంచి శ్రీనివాసులు ఇల్లరికం అల్లుడిగా వీరి వద్దే ఉంటున్నాడు. రెండున్నరేండ్ల కిందట శివమ్మ కూతురు శ్రావణి పెండ్లి కోసం బాలస్వామి రూ.12 లక్షలు అప్పు చేశాడు. వారికి నాలుగెకరాల పొలం ఉంది. అందులో ఐదు బోర్లు వేసేందుకు రూ.3 లక్షల వరకు అప్పు చేశాడు. ఈ మొత్తం అసలు, వడ్డీతో కలిపి రూ.20 లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ ఏడాది వానకాలంలో మొక్కజొన్న వేయగా.. వర్షాలు బాగా కురిసి పంట దెబ్బతిన్నది. ఆ తర్వాత వరి సాగు చేశాడు. ఆశించిన మేర పంటల దిగుబడి రాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనోవేదనకు గురై సోమవారం పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు.

వందల కోట్లు చేతులు మారాయ్?

- ఫార్మా కంపెనీ ఏర్పాటులో అక్రమాలు
- ఆ కంపెనీలో రేవంత్ అల్లుడు సత్యనారాయణరెడ్డికి 16 లక్షల షేర్లు
- నిధుల మళ్లింపుపై విచారణ చేపట్టండి
- ఢిల్లీలో ఈడీకి మన్నె క్రిశాంక్ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): కొడంగల్ నియోజకవర్గంలో రైతుల భూములను అక్రమంగా లాక్కుంటూ ఫార్మా కంపెనీని అక్కడకు తీసుకొచ్చే ప్రయత్నంలో వందల కోట్లు చేతులు మారినట్టు అనుమానంగా ఉందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు. ఫార్మా కంపెనీ ఏర్పాటులో జరుగుతున్న అక్రమాలను నిగ్గు తేల్చాలని ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో మంగళవారం ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం క్రిశాంక్ మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలో రైతుల భూములు తీసుకొని మ్యాక్స్‌బీన్ ఫార్మా కంపెనీకి కట్టబెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని, ఆ ఫార్మా కంపెనీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అల్లుడైన గొలుగూరి సత్యనారాయణరెడ్డికి 16 లక్షల షేర్లు ఉన్నట్టు తెలిపారు. మరో 21 లక్షల షేర్లు ఎస్‌వీఎస్ ఫెసిలిటీకి, దాని డైరెక్టర్ అన్నం శరత్ పేరిట ఉన్నాయని పేర్కొన్నారు. సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యుల మీద ఇప్పటికే ఎన్నో కేసుల్లో ఈడీ దర్యాప్తు కొనసాగుతున్నదని తెలిపారు. వారు ఎన్నో మోసాలకు పాల్పడ్డారని ఈడీ చెప్తున్నదని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులు బ్యాంకులను మోసం చేసి రుణాలను దారిమళ్లించారని, వాటితో ఆస్తులు కూడబెట్టారని, వ్యాపారాలు మొదలుపెట్టారని ఈడీ దర్యాప్తుల్లో తేలిందని చెప్పారు. కొడంగల్‌లలో నిర్మించబోయే ఫార్మా విలేజ్‌లో మ్యాక్స్‌బీన్ ఫార్మా కంపెనీ ఏర్పాటు పేరుతో కొన్ని కోట్ల రూపాయలు నిధులు దారి మళ్లించినట్టు అనుమానం ఉందని పేర్కొన్నారు. అందుకనే ఈడీకి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

సోదరులే వ్యాపారస్తులు

గొలుగూరి రామకృష్ణారెడ్డి, గొలుగూరి వెంకట్‌రెడ్డి ఇద్దరూ సోదరులే కాకుండా చాలా కంపెనీల్లో డైరెక్టర్లుగా వ్యాపారాలు చేస్తున్నారని క్రిశాంక్ తెలిపారు. గొలుగూరి వెంకట్‌రెడ్డి మ్యాక్స్‌బీన్ ఫార్మా కంపెనీ డైరెక్టర్‌గా ఉన్నారని, ఆయన కుమారుడు, సీఎం రేవంత్‌రెడ్డి అల్లుడు సత్యనారాయణరెడ్డి కూడా ఒక డైరెక్టర్‌గా ఉన్నారని తెలిపారు. ఈడీ పేర్కొన్నట్టు కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు ఈ కంపెనీలోకి కూడా డైవర్ట్ అయ్యే అవకాశం ఉన్నదని అనుమానం వ్యక్తం చేశారు. గొలుగూరి కుటుంబసభ్యులపై ఇప్పటికే ఎన్నో బ్యాంక్ ఎగవేత కేసులు ఉన్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని మ్యాక్స్‌బీన్ ఆర్థిక లావాదేవీలపై విచారణ చేపట్టాలని కోరుతూ ఆధారాలు జతచేసినట్టు వివరించారు.క్రిశాంక్ ఫిర్యాదును స్వీకరించిన ఈడీ దర్యాప్తునకు హామీ ఇచ్చినట్టు తెలిపారు.

గొలుగూరి వెంకట్‌రెడ్డిపై ఈడీ కేసు

కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఫిష్ ట్యాంకుల నిర్మాణం కోసం ఐడీబీఐ బ్యాంకు నుంచి మోసపూరితంగా రూ. 311 కోట్ల రుణాలు తీసుకున్న కేసులో రేవంత్‌రెడ్డి వియ్యంకుడి తమ్ముడు గొలుగూరి రామకృష్ణారెడ్డిపై గతంలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసింది. రాజమండ్రి కేంద్రంగా ఈ మోసం వెలుగులోకి రావడంతో ఐడీబీఐ అధికారులు విశాఖపట్నం సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు రంగంలోకి దిగి కేసు ప్రధాన నిందితుడైన నేరెళ్ల వెంకటరామమోహన్‌రావుతో పాటు బడిగంట్ల శ్రీనివాసరావు, బండి నారాయణరావు, గిడుగు సత్యనాగేంద్ర శ్రీనివాసరావు, కర్రి గాంధీ, డాక్టర్ మానేపల్లి సూర్యమాణిక్యం, మానేపల్లి సూర్యనారాయణ గుప్తా, ఆర్‌వీ చంద్రమౌళిప్రసాద్, గొలుగూరి రామకృష్ణారెడ్డి, వానపల్లి నారాయణరావుపై ఐపీసీ, అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద సీబీఐ కేసు నమోదు చేసింది. వీరు 350 మంది రుణగ్రహీతల పేర్లతో రాజమండ్రి ఐడీబీఐ శాఖ నుంచి కేసీసీ ఫిష్ ట్యాంక్ నిర్మాణాల కోసం రూ. 311.05 కోట్ల రుణాలు పొందారని తెలిపింది. తాజాగా గత జూలై 31న రూ.19.11 కోట్ల స్థిరాస్తులను అటాచ్ చేసింది. వీరు గతంలో తీసుకున్న రూ.311 కోట్ల రుణాలను వారి కుటుంబసభ్యులు, బినామీల పేరు మీద స్థిరాస్తుల కొనుగోలు చేశారు.

హుజూర్‌నగర్‌లో దుకాణాలను తొలగిస్తున్న మున్సిపాలిటీ అధికారులు

మా జీవనాధారం కూల్చితే బతికేదెట్లా?

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పీర్లచావిడి బజార్‌లో రోడ్డుపై ఉన్న రెండు దుకాణాలను మంగళవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా దుకాణాదారులు, మున్సిపల్ అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. 40 ఏండ్ల నుంచి చేతివృత్తులు(రజక, మంగళి) చేసుకుంటూ జీవిస్తున్నామని, ఇప్పుడు తమ దుకాణాలు తొలగిస్తే మేం బతికేదెట్లా? అని దుకాణాదారులు కుటుంబ సభ్యులతో కలిసివచ్చి ఆందోళన చేపట్టారు. తమ పైనుంచి వాహనాన్ని పోనిచ్చి ఆ తర్వాతే తమ ఇస్త్రీ దుకాణాన్ని కూల్చివేయాలని ఇందిరాల రాంబాబు అనే వ్యక్తి జేసీబీకి అడ్డుగా పడుకొని భీష్మించాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారితో చర్చలు జరిపి శాంతింపజేశారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏండ్ల క్రితం నిర్మించినా, అవి అక్రమమైతే తొలగించడం తప్పదన్నారు. -హుజూర్‌నగర్

అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇవ్వండి

ప్రజాభవన్‌లో డీఎస్సీ-2008 బాధితుల ఆవేదన

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): తమకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయ్యి 50 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇవ్వడం లేదని డీఎస్సీ-2008 అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ జిల్లాలకు చెందిన 200 మందికిపైగా అభ్యర్థులు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు తరలివచ్చి తమ గోడు వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ఉద్యోగాలు ఇచ్చేందుకు నిర్ణయించి, ఇటీవల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తి చేసిందని గుర్తు చేశారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, క్యాబినెట్ మంత్రులు, విద్యాశాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయి 50 రోజులు గడుస్తున్నా అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వేదనను అర్థం చేసుకొని, కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి వారితో మాట్లాడారు. వెంటనే విద్యాశాఖ కమిషనర్ నర్సింహారెడ్డి, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని అభ్యర్థులకు ఆయన హామీ ఇచ్చారు. కాగా మంగళవారం ప్రజావాణికి 614 దరఖాస్తులు అందాయి. ప్రపంచ పిల్లల దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు 11 గంటలకు పిల్లల కోసం ప్రజావాణి నిర్వహించనున్నట్టు తెలిపారు.